


ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు : గాయపడ్డ ఎస్సై రాజారాంను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

ఈనాడు కామారెడ్డి
బుధవారం సెప్టెంబరు 25, 2024

ఐదు గంటలు సాగిన ఆందోళన

● నిరసనలతో అట్టుడికిన జిల్లాకేంద్రం
● భారీగా పోలీసు బలగాల మోహరింపు

ఈనాడు, కామారెడ్డి, కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఆందోళన ఐదుగంటల పాటు కొనసాగింది. ఆరేళ్ల బాలికతో వ్యాయామ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై పలువురు అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. బడి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపల్, వైస్‌ప్రిన్సిపల్‌తో పాటు నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆందోళన కొనసాగించారు. తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు ఆందోళనకారులపై లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. జిల్లాకేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు ఇతర జిల్లాల నుంచి అదనపు బలగాలను రప్పించి మోహరించారు.

శాంతియుతంగా ప్రారంభమై..

బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం ఉదయం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. కామారెడ్డి పుర ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అక్కడికి చేరుకుని ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసనలో పాల్గొన్నారు. డీఈవో రాజు, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అక్కడికి వచ్చి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.

ఒక్కసారిగా ఉద్రిక్తత

డీఈవో, పాఠశాల నిర్వాహకులు నిరసన కొనసాగే ప్రదేశానికి వచ్చేందుకు ససేమిరా అనడంతో ఆందోళన ఉద్రిక్తంగా మారింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఓ వర్గానికి చెందిన వందలాది మంది పాఠశాలకు చేరుకున్నారు. లోపలికి చొరబడి ఫర్నీచర్‌తో పాటు ప్రాంగణంలోని వస్తువులు ధ్వంసం చేశారు. నిరసనకారుల రాళ్ల దాడితో పోలీసులూ గాయపడ్డారు. పరిస్థితి చేయిదాటుతుండటంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పడంతో పలువురు ఆందోళనకారులు గాయపడ్డారు. నిరసనకారుల రాళ్ల దాడిలో గాయపడిన పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తలకు ఆరు కుట్లు పడ్డాయి. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయపడగా, పట్టణ ఎస్సై రాజారాం సైతం దెబ్బలు తగిలాయి. ఆందోళనకారుల దాడిలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాత్రికేయులకు దెబ్బలు తగిలాయి. ఈ ఘటనతో బడిలో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు బెంబేలెత్తారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్పీ సింధూశర్మ చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు.

దుకాణాల మూసివేత

పట్టణంలో శాంతిభద్రతలు అదుపుతప్పకుండా ఓ ప్రైవేటు పాఠశాల నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను పోలీసులు మూసివేయించారు. రహదారిపై వాహనదారులతో పాటు సాధారణ ప్రజలనూ పంపించివేశారు. జిల్లాలో మూడు డివిజన్‌లకు చెందిన బలగాలతో పాటు మెదక్, నిజామాబాద్ పోలీసులను రప్పించి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న నిరసనకారులు



ఉద్రిక్తతల నేపథ్యంలో మూసి ఉంచిన దుకాణాలు

ప్రజలు వదంతులు నమ్మొద్దు

- సింధూశర్మ, ఎస్పీ, కామారెడ్డి

నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశాం. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాఠశాలపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటాం. విద్యార్థిని ఆరోగ్యంగానే ఉంది. ప్రజలు వదంతులను నమ్మొద్దు.



నిరసనకారులతో చర్చలు జరుపుతున్న ఎస్పీ సింధూశర్మ

రాళ్లతో ఆందోళనకారుల దాడి.. పోలీసుల లాఠీఛార్జీ

తమపై అకారణంగా పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని నిరసిస్తూ ఆందోళనకారులు నిజాంసాగర్ రోడ్డులో బైఠాయించారు. ఎస్పీ సింధూశర్మ అక్కడికి చేరుకుని చర్చలు జరిపారు. ఆందోళనను విరమించి ఇళ్లకు వెళ్లాలని ఆదేశాలు జారీచేశారు. పోలీసులు నిరసనకారులను చెదరగొట్టారు. చివరకు పోలీసుస్టేషన్ వద్దకు చేరుకునే క్రమంలో నిరసనకారులు రైల్వేబ్రిడ్జిపై ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకుని లాఠీలను ఝళిపించారు.



ఆలోచన అదిరి.. పంటలు పండి

జుక్కల్ మండల శివారులో రైతులు పొలంలో ఒకేసారి రెండు పంటలను సాగు చేస్తున్నారు. తొలుత కంది పంటను వేశారు. ఇది దిగుబడి రావడానికి ఆరు నెలల సమయం పడుతుంది. అదే పొలంలో అంతర పంటగా సోయాను పండిస్తున్నారు. ఈ పంట నాలుగు నెలల్లో చేతికొస్తుంది. ఇలా ఒకే సమయంలో రెండు పంటలను పండించి లాభాలు గడిస్తున్నారు రైతులు. రెండు పంటలకు పెట్టుబడి వ్యయం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అవుతుందని, దిగుబడి బాగా వస్తే రూ.50 వేల వరకు లాభాలు వస్తాయని అన్నదాతలు చెబుతున్నారు.

- ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడ్, జుక్కల్

కేవీకే శాస్త్రవేత్తలతో 'ఈనాడు' ఫోన్-ఇన్ నేడు

సమయం :
ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :
80080 03433
99896 23830
86399 72799

న్యూస్‌టుడే, కోటగిరి : వానాకాలం పంటల సాగులో అధిక వర్షాలతో చీడపీడలు, తెగుళ్లు ఆశించి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. వీటి బారి నుంచి పంటలను రక్షించుకోవడం కర్షకులకు సవాలుగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు సాయంగా నిలిచేలా రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలతో బుధవారం 'ఈనాడు' ఫోన్-ఇన్ కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులు ఫోన్ ద్వారా అడిగిన సందేహాలను వివిధ విభాగాల శాస్త్రవేత్తలు నివృత్తి చేస్తారు.

లీకేజీ అరికట్టారు



బీర్కూర్, న్యూస్‌టుడే: వీరాపూర్‌లో వాటర్ గ్రిడ్ చాంబర్‌లో పాకురుతో ఉన్న నీరు వీరాపూర్, వీరాపూర్ దుబ్బా, మిర్జాపూర్ గ్రామాలకు సరఫరా అవుతుండటంపై మంగళవారం ఈనాడులో 'కలుషిత నీరు.. జనం బేజారు' శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వాటర్ గ్రిడ్ ఏఈ రాజశేఖర్ లీకేజీ అరికట్టేలా చర్యలు చేపట్టారు.

ఈనాడు కథనానికి స్పందన

ఆర్డీవోకు వినతి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిలో నూతనంగా నిర్మిస్తున్న బస్టాండు నిర్మాణ పనులు పూర్తిచేయక అసంపూర్తిగా వదిలేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని పలు పార్టీల నాయకులు ఆర్డీవో ప్రభాకర్‌కు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు.

ఆడబిడ్డలపై ఆగని అఘాయిత్యాలు

కలగానే జిల్లాలో మహిళా పోలీసుస్టేషన్ ఏర్పాటు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే

గృహహింస, ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, వెకిలి మాటలు-చేష్టలతో ఇంటా-బయటా జిల్లాలో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు జరిగిన అన్యాయాలను చెప్పుకొందామంటే మహిళా పోలీసుస్టేషన్ లేక అవస్థలు తప్పడం లేదు.

పరిస్థితి ఎలాగుందంటే..?


2011 లెక్కల ప్రకారం జిల్లా మొత్తం జనాభా 9,74,227 మంది కాగా అందులో మహిళలు 4,95,035 మంది ఉన్నారు. జనాభాలో సగ భాగం మహిళలే ఉన్నారు. వారిపై నేరాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి జిలాకేంద్రానికి వచ్చిన సమయంలో మహిళా పోలీసుస్టేషన్ ఏర్పాటు కావాలని చెప్పినా అమలుకు నోచుకోలేదు. కనీసం ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఏర్పాటవుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రభుత్వానికి ప్రతిపాదిస్తాం

జిల్లాలో మహిళా పోలీసుస్టేషన్ ఏర్పాటు ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. మహిళా ఠాణా ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం. కార్యరూపం దాల్చితే మహిళలకు ఎంతో మేలు జరుగుతుంది.

- సింధూశర్మ, జిల్లా ఎస్పీ

జిల్లాలో ఈ ఏడాది ఆగస్టు వరకు మహిళలపై జరిగిన వివిధ నేరాల వివరాలు



నేరం	నమోదైన కేసులు
హత్యలు	5
వరకట్న మరణాలు	2
వరకట్న వేధింపులు	249
ఈవ్ టీజింగ్	11
ఇతర వేధింపులు	51
అపహరణలు(కిడ్నాప్)	2
వివిధ రకాలుగా వేధించడం	20
పోక్సో యాక్ట్	4
అత్యాచారం	29
ఇతర పోక్సో కేసులు	4



కౌలాస్ గేటు ఎత్తివేత

జుక్కల్, న్యూస్‌టుడే: కౌలాస్ నాలా జలాశయం ఒక్క గేటు ఎత్తి వరద నీటిని దిగువ మంజీరాలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 458 మీటర్లతో 1.237 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 457.95 మీటర్లతో 1.225 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఎగువ నుంచి 526 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో రావడంతో ఒక గేటు ఎత్తి 571 క్యూసెక్కుల మేర నీటిని మంజీరాలోకి, 100 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువ నుంచి ఆయకట్టుకు విడుదల చేస్తున్నామన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయం ప్రధాన వరద గేట్ల నుంచి మంజీరా నదిలోకి నీటి విడుదల కొనసాగుతుందని జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి సాగర్‌లోకి 10,105 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో 2 ప్రధాన వరద గేట్లను ఎత్తి 8,100 క్యూసెక్కుల నీటిని దిగువన మంజీరాలోకి, జలవిద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 2005 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల కొనసాగుతోందని చెప్పారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.93 అడుగుల (17.701 టీఎంసీలు) నీరు ఉందని పేర్కొన్నారు.



మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలి

రాజంపేట, న్యూస్‌టుడే: మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. రాజంపేట మండలంలో మంగళవారం పర్యటించారు. పల్లె ప్రకృతివనంలో గడ్డి తొలగించాలని, నర్సరీలో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించడంపై ఎంపీవో, పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులకు సూచించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడారు. పెద్దాయిపల్లిలో రైస్‌మిల్లును తనిఖీ చేసి సీఎంఆర్ బియ్యం గడువులోగా పంపించాలన్నారు. డీఎంహెచ్‌వో పద్మ, జిల్లా అధికారులు, తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో రాజేశం, మండల అధికారులు ఉన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

విద్యాశాఖ పర్యవేక్షణకు బాధ్యతల అప్పగింత

కామారెడ్డి విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆయా మండలాల విద్యాశాఖ పర్యవేక్షణకు సీనియర్ ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్నేళ్ల నుంచి మండలాలకు ఎంఈవోలు లేక పర్యవేక్షణ కష్టమైంది. దీంతో ఆరు నుంచి ఎనిమిది మండలాలకు ఒక్కరే ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా రాష్ట్రవిద్యాశాఖ సీనియర్ ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు కట్టబెట్టింది. నాగేశ్వర్‌రావు (బాన్సువాడ), దేవేందర్‌రావు (మాచారెడ్డి) రాములు (మద్నూర్), షౌకత్ (లింగంపేట), యోసెఫ్ (సదాశివనగర్), వెంకటేశం (ఎల్లారెడ్డి) వెంకన్న (బీర్కూర్), ఎల్లయ్య (కామారెడ్డి), తిరుపతయ్య (జుక్కల్), పూర్ణచందర్ (రాజంపేట), నందారావు (రామారెడ్డి), తిరుపతిరెడ్డి (నిజాంసాగర్), భాస్కర్‌రెడ్డి (నాగిరెడ్డిపేట), చందర్ (నస్రుల్లాబాద్) అశోక్ (బీబీపేట), విజయ్‌కుమార్ (దోమకొండ), జీతాలాల్ (పల్వంచ), రాజగంగారెడ్డి (భిక్కనూరు), శ్రీనివాస్ (డోంగ్లీ), రామస్వామి (తాడ్వాయి), ప్రవీణ్‌కుమార్ (పెద్దకొడప్‌గల్), శ్రీహరి (గాంధారి), అమర్‌సింగ్ (మహమ్మద్‌నగర్) మండలాలకు ఎఫ్‌ఏసీపై ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

నిజామాబాద్ ఐటీఐలో కొత్త కోర్సులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

మారుతున్న పరిస్థితులకనుగుణంగా పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ)ను ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పారిశ్రామిక శిక్షణ, ఉపాధి కల్పన మండలి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీఐల స్థితిగతులు, పరికరాలు, మౌలిక వసతులపై అధ్యయనం చేస్తూ ఉన్నతీకరణ ప్రక్రియ ప్రారంభించింది. ఇది వరకే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో విజయవంతమైన టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీ)గా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. టీటీఎల్ ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిజామాబాద్, ఖమ్మం, మల్లెపల్లి(హైదరాబాద్) ఐటీఐల్లో కొత్త కోర్సులు ప్రవేశ పెట్టింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బాలుర ఐటీఐలో ఆరు నూతన కోర్సులు ప్రవేశ పెట్టి ఐదో దశలో ప్రవేశాలకు అవకాశం కల్పించింది.



నగరంలోని బాలుర ఐటీఐ భవన సముదాయం

ప్రవేశం ఇలా..

☛ ఈ నెల 23వ తేదీ నుంచి 28 వరకు వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకొని, అన్ని నిజధ్రువపత్రాలు అప్లోడ్ చేయాలి.

☛ 25వ తేదీ నుంచి 28 వరకు ఉదయం 11 గంటలకు బాలుర ఐటీఐ కళాశాలకు హాజరు కావాలి. మొదటి రోజు ప్రవేశం లభించని వారు రెండో రోజు, అడ్మిషన్ పూర్తి కాని వారు మూడో రోజు హాజరు కావాల్సి ఉంటుంది.

☛ గైర్హాజరైతే మెరిట్ ప్రకారం ఆ రోజు హాజరైన అభ్యర్థికి సీటు కేటాయిస్తారు.

☛ దరఖాస్తు సమయంలో ఇచ్చిన చరవాణి నెంబర్, ఈ-మెయిల్ కోర్సు పూర్తయ్యేవరకు మార్చుకోరాదు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- యాదగిరి, జిల్లా కన్వీనర్, బాలుర ఐటీఐ ప్రిన్సిపల్, నిజామాబాద్



రాష్ట్రంలో మొదటిసారి అవకాశం దక్కింది. అందులో బాలుర ఐటీఐ ఉండటం గొప్ప విషయం. భవిష్యత్తు డిమాండ్ దృష్ట్యా ఈ కొత్త కోర్సులు ప్రవేశపెట్టినందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

కోర్సులు, సీట్ల వివరాలు

కోర్సు	కాలపరిమితి	సీట్లు
మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	ఏడాది	40
ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్	ఏడాది	40
అర్టిఫిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	ఏడాది	20
బేసిక్ డిజైన్ అండ్ వర్చువల్ వెరిఫైయర్	రెండేళ్లు	24
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్	రెండేళ్లు	24
మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికిల్	రెండేళ్లు	24
	మొత్తం	172

మహిళ హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మహిళను హత్యచేసిన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ముదెల్లికి చెందిన ఓద్దూల కాశమణి, సుతారి చిన్న బాలయ్యలకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.3 వేల జరిమానా విధిస్తూ నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక జడ్జి టి.శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ముదెల్లికి చెందిన కాశమణి తన భర్తతో బాన్సువాడ మండలం జె.కె.తండాకు చెందిన మహిళ(28)తో వివాహేతర సంబంధం పెట్టుకుందని అనుమానించారు. ఈ విషయమై వారి మధ్య తరచూ గొడవ జరిగేది. ఆమె నుంచి భర్తను కాపాడుకునేందుకు గ్రామానికి చెందిన సుతారి చిన్న బాలయ్యతో కలిసి హత్యకు ప్రణాళిక వేశారు. 2019 ఆగస్టు 29న భర్తతో ఆమెతో కలిసి బాన్సువాడ కూరగాయల సంతకు వెళ్లారు. గాలిపూర్‌లో బంధువుల వద్ద కుదురు ఉందని తీసుకెళ్లారు. నిజాంసాగర్ కెనాల్‌పై నడుచుకుంటూ వెళ్తున్నారు. అప్పటికే అక్కడున్న బాలయ్యతో కలిసి మహిళ మెడకు తాడుతో చుట్టి శ్వాస ఆడకుండా చేశారు. ఆపై బండరాయితో తలపై కొట్టి చంపి కాలువలోకి తోసేశారు. మహిళ భర్త కాశమణికి ఫోన్ చేయగా ఆరా తీస్తే ముందే వెళ్లిపోయిందని బుకాయించారు. 2019 ఆగస్టు 30న బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం అంగీకరించడంతో ఇద్దరిపై హత్యానేరం కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. పోలీసుల తరఫున అదనపు కోర్టు పీపీ బంటు వసంత్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి ఈ మేరకు తీర్పు చెప్పారు.



గోడును చెప్పుకొంటున్న బాధితులు

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

మాచారెడ్డి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గుడిసె కాలిపోయిన ఘటన పల్వంచ మండలకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాందేడి రమేశ్ కుటుంబంతో గుడిసెలోనే నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం గుడిసెలోకి సరఫరా అయ్యే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చేలరేగాయి. స్థానికులు గమనించి గుడిసెలో ఉన్న వారిని బయటకు తీసుకువచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలను ఆర్పి వేశారు. రూ.2.50 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

మల్టీపర్పస్ కార్మికులకు నైపుణ్య శిక్షణ

న్యూస్‌టుడే,కామారెడ్డి కలెక్టరేట్

పల్లెల్లో మిషన్ భగీరథ పనుల నిర్వహణ కోసం పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు నైపుణ్య శిక్షణ ప్రారంభమైంది. ప్రభుత్వ సూచన మేరకు అధికారులు ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 23వ తేదీన ప్రారంభమైన శిక్షణ ఐదు విడతల్లో సాగనుంది. ఈ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత కార్మికులు భగీరథ పనులపై అవగాహన పెంచుకుని సొంతంగా మరమ్మతులు చేసి ప్రజలకు నీటి సరఫరాను పునరుద్ధరించాల్సి ఉంటుంది.



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న మిషన్ భగీరథ ఈఈ రమేశ్

సేవల్లో జాప్యం ఉండదు - రమేశ్, ఈఈ, మిషన్ భగీరథ, కామారెడ్డి

ప్రభుత్వ సూచన మేరకు మల్టీపర్పస్ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. ఇది నెల రోజుల పాటు కొనసాగుతోంది. స్థానికంగా పనిచేసే సిబ్బందికే శిక్షణ ఇవ్వడం వల్ల వారు వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేస్తారు. దీంతో ప్రజలకు సత్వర సేవలు అందుతాయి.

ఏయే అంశాలపై అంటే..

జిల్లాలో ఒక్కో పంచాయతీ నుంచి ఒక్కో కార్మికుడిని శిక్షణ కోసం ఎంపిక చేశారు. మేజర్ పంచాయతీలు ఉంటే ఇద్దరు చొప్పున తీసుకున్నారు. మొత్తంగా ఐదు విడతల్లో శిక్షణ నిర్వహిస్తుండగా.. ఒక్కో విడతలో నాలుగు రోజుల పాటు కార్యక్రమం కొనసాగనుంది.

నీటి నాణ్యతపై: గ్రామాల్లో సరఫరా చేస్తున్న నీటి నాణ్యత పరీక్షలను ఇకపై మల్టీపర్పస్ కార్మికులే నిర్వహిస్తారు. ట్యాంకుల క్లోరినేషన్, ట్యాంకులను శుభ్రం చేయడం, ఎన్ని రోజులకు క్లోరినేషన్ చేయాలనే అంశాలపై శిక్షణ ఇస్తారు. ట్యాంకు వద్ద సమస్యలు ఉత్పన్నమైతే సరిచేసి నీటి సరఫరా కొనసాగిస్తారు.

హ్యాండ్ పంపులను వినియోగంలోకి తీసుకురావడం: గ్రామాల్లో ఒకప్పుడు హ్యాండ్ పంపులే ఉండేవి. ఇప్పుడవి నిరుపయోగంగా ఉన్నాయి. మల్టీపర్పస్ కార్మికులు వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

ఎలక్ట్రీషియన్: గ్రామాల్లో సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ బోరుబావులకు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతాయి. ప్యానల్ బోర్డులు చెడిపోయి సమస్య తలెత్తుతుంది. ఎలా పరిష్కరించాలో ఇంజినీర్లు కార్మికులకు శిక్షణ ఇస్తారు.

ప్లంబింగ్: గ్రామాల్లో ప్రధానమైనది పైప్‌లైన్ లీకేజీ సమస్య. రోడ్లపై, మురుగుకాల్వల్లో పైప్‌లైన్లు పగిలి నీరు కలుషితం అవుతుంది. దీంతో ప్లంబర్ వచ్చే వరకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది. అందుకే స్థానిక కార్మికుడికే ప్లంబింగ్ పనుల్లో తర్ఫీదు ఇస్తున్నారు.



ఎస్‌జీఎఫ్‌కు ఎంపికైన క్రీడాకారులు

క్రీడాకారుల ఎంపికలు పూర్తి

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాల షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు మంగళవారం పూర్తయ్యాయి. స్థానిక బ్యాడ్మింటన్ కోర్టులో అండర్-17 బాలుర విభాగంలో 24 జట్లు, బాలికల విభాగంలో 12 జట్లు పాల్గొన్నాయి. ఇందులో బాలుర సింగిల్స్ విభాగం నుంచి గురు, కార్తికేయ(నిజామాబాద్), వాల్మీకిష్(మాచారెడ్డి), వస్త్రావుకుమార్(నిజామాబాద్) ఎంపికయ్యారు. బాలికల విభాగం నుంచి అనన్య(నిజామాబాద్), భువనకృతి(కామారెడ్డి), వాగ్దేవి(నిజామాబాద్) ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. బాలుర డబుల్స్ విభాగం నుంచి కార్తికేయ, విశ్వక్(నిజామాబాద్), బాలికల విభాగం నుంచి అనన్య, వాగ్దేవి(నిజామాబాద్ ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ తెలిపారు.

26న ఉద్యోగ మేళా

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ఈ నెల 26వ తేదీన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ప్రముఖ ప్రైవేట్ కంపెనీలో పనిచేయడానికి ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన ఔత్సాహికులు కలెక్టరేట్‌లోని రూంనెంబర్ 121లో నిర్వహించే మౌఖిక పరీక్షలకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 28 మధ్య ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు 76719 74009, 81210 18260 నంబర్లకు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా

గాంధారి, న్యూస్‌టుడే: తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఐదో సాంస్కృతిక ఉత్సవ పోటీల్లో గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ సురేశ్ చంద్ర సిర్వి తెలిపారు. ఈ నెల 21, 22న రాజన్న సిరిసిల్ల మరిమడ్లలోని ఏకలవ్య ఆదర్శ గురుకులం పాఠశాలలో జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు చెప్పారు.



బహుమతులు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

సామర్థ్యాలు మెరుగుపర్చుకోవాలి


కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని విద్యాశాఖ జిల్లా అధికారి రాజు అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని దేవునిపల్లి ప్రభుత్వ బడిలో ఇన్నోవేటివ్ హబ్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో హబ్‌ను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, ఫౌండేషన్ ప్రతినిధులు వసంత్, మల్లిక, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.



ఇన్నోవేటివ్ హబ్‌ను ప్రారంభిస్తున్న డీఈవో రాజు

చేనేత శిక్షణతో ఉపాధి

దోమకొండ, న్యూస్‌టుడే: మహిళలు చేనేత శిక్షణతో ఉపాధిని పొందాలని దోమకొండ మండల ప్రత్యేకాధికారి జ్యోతి అన్నారు. మంగళవారం దోమకొండలోని గడీ కోట ట్రస్టు, చేనేత సహకార సంఘం సహకారంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సమర్థ పథకం'లో భాగంగా మహిళలకు చేనేత శిక్షణపై తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. బీడీ కార్మికులు చేనేత శిక్షణ సదుపాయాన్ని వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించుకోవాలని సూచించారు. చేనేత సొసైటీ హైదరాబాద్ డైరెక్టర్ పుగాలెంతి, అడిషనల్ డైరెక్టర్ పవన్, చేనేత సాంకేతిక సహాయకుడు సంతోష్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, స్థానిక చేనేత సొసైటీ ఛైర్మన్ బొమ్మెర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు సామగ్రి అందిస్తున్న మండల ప్రత్యేకాధికారి జ్యోతి, అధికారులు



విజేతలతో విద్యాశాఖ జిల్లా సమన్వయకర్తలు

పోస్టర్‌మేళాలో విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి పట్టణం: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో కౌమారవిద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్‌మేళా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో బ్లూబెల్స్(పిట్లం) బడికి చెందిన అమృత ప్రథమ, బాలికోన్నత బడి(భిక్కనూరు)కి చెందిన హారిక ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. విద్యాశాఖ సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగవేందర్, వెంకటరమణ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా అధికారి సుధాకర్, ప్రతినిధులు ప్రతాప్‌రెడ్డి, కృష్ణచైతన్య, కృష్ణకర్‌రావు, సురేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుకు ఆహ్వానం

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని చాముండేశ్వరీ ఆలయంలో అక్టోబరు 3 నుంచి 11 వరకు నిర్వహించనున్న దేవీ నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఉత్సవాలకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెద్దిరెడ్డి సిద్ధారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు, నాయకులు



మాధవనగర్ వైపు బురద రోడ్డు



డిచ్‌పల్లి వైపు గుంతలమయంగా

తారు తొలగింది.. మరమ్మతులు చేయండి

డిచ్‌పల్లి-నిజామాబాద్ బైపాస్ వద్ద రైల్వే వంతెన పనుల కారణంగా అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గుంతల్లో నీరు నిలవడంతో లోతు తెలియక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా తాత్కాలిక రోడ్డు వేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, డిచ్‌పల్లి గ్రామీణం

27న నిధి ఆప్కే నికత్

ఖలీల్‌వాడి: నిధి ఆప్కే నికత్ కార్యక్రమం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-1 గణేశ్ కుమార్ పేర్కొన్నారు. ముబారక్ నగర్‌లో విజయ్ హైస్కూల్, కామారెడ్డి జిల్లా కేంద్రం నిజాంసాగర్ రోడ్డులోని చాట్ల నర్సయ్య రామయ్య బీడీ తయారీ కంపెనీలో ఉంటుందని తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పింఛనర్లు తగిన ఆధారాలతో వచ్చి ఫిర్యాదులు అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు.

319 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం శివారులో తనిఖీల్లో రూ.79.75 లక్షల విలువైన 319 కిలోల గంజాయి, రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలను ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంటు, పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆబ్కారీ అధికారులు జనార్దన్‌రెడ్డి, గణేశ్, జానయ్య, తిరుపతి, కరంచంద్ మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా వేర్వేరు ఘటనల్లో సరకు పట్టుబడినట్లు తెలిపారు. వాహనాలతో కలిపి మొత్తం విలువ రూ.కోటి ఉంటుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లికి చెందిన నేరళ్ల అపర్ణ, అఖిల్ (తల్లీకొడుకు) కారులో హైదరాబాద్ తరలిస్తున్న 100 కిలోల గంజాయిని భద్రాచలం వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధమున్న పాత నేరస్థుడు నిజామాబాద్‌కు చెందిన మునావర్ అలీని అదుపులోకి తీసుకున్నారు. ఈయన ఓ మహిళా కార్పొరేటర్ కుమారుడు కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ మోతుగూడెం సరిహద్దు ప్రాంతాల నుంచి కారులో తరలిస్తున్న 180కిలోల గంజాయిని సోమవారం పట్టుకుని హైదరాబాద్ బేగంబజార్‌కు చెందిన దత్తు పంచాలను అదుపులోకి తీసుకున్నారు. మరో కేసులో హైదరాబాద్ ఫతేనగర్, బాలానగర్‌కు చెందిన శక్తి రాహల్, గోపీశెట్టి అక్షిత్‌లను అదుపులోకి తీసుకొని 14, 25 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మరో నలుగురు పరారయ్యారన్నారు.



నిందితులతో అధికారులు, సిబ్బంది

మునావర్‌పై పలు కేసులు: నిజామాబాద్ నేరవిభాగం: భద్రాచలంలో పట్టుబడిన నిజామాబాద్‌కు చెందిన నిందితుడు మునావర్‌పై 2013, 2017, 2018లో నిజామాబాద్ రూరల్, నాలుగో ఠాణా, నిజామాబాద్ రైల్వే పోలీసు ఠాణాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా బచ్చన్నపేట, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి, విజయవాడలో కేసులు నమోదైనట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు.

'వైద్యుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: వైద్యుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే ఊరుకోబోమని ఐఎంఏ కామారెడ్డి అధ్యక్షుడు రమణ అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఓ ఆసుపత్రిలో వేసిన కుట్లు విప్పేశారనే వార్తలు మీడియాలో వచ్చాయన్నారు. ఇది ఏ మాత్రం సరికాదన్నారు. అసలు అక్కడ ఆ రోగికి కట్టు కట్టామని, కుట్లు వేయలేదన్నారు. క్షతగాత్రుడు, అతడి సంబంధీకులు ఆసుపత్రిలో గొడవకు దిగడం అన్యాయమన్నారు. ఈ ఘటనను కామారెడ్డి ఐఎంఏ పక్షాన ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో ఐఎంఏ జిల్లా ప్రధానకార్యదర్శి అర్వింద్‌గౌడ్, వైద్యులు వెంకటేశ్వర్‌గౌడ్, నవీన్, రమేశ్‌బాబు, మల్లికార్జున్, వెంకట్ తదితరులున్నారు.




మాట్లాడుతున్న ఐఎంఏ అధ్యక్షుడు రమణ, పక్కన ప్రధాన కార్యదర్శి అరవింద్‌గౌడ్, వైద్యులు

రేపు ఉమ్మడి జిల్లా యోగా పోటీలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఈ నెల 26న ఉమ్మడి జిల్లా అండర్ 14, 17 యోగాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరలాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు యోగాభవన్‌లో నిజ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. ఒక బడి నుంచి ఒక్కో విభాగంలో ఇద్దరు క్రీడాకారులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. సమగ్ర వివరాలకు 94900 15388 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

వర్సిటీలో మళ్లీ పాము కలకలం



గ్రంథాలయంలో..

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: గత శనివారం తెలంగాణ వర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ కళాశాల ల్యాబ్‌లో పాము కనిపించిన ఘటన మరవకముందే.. మరోసారి గ్రంథాలయంలో పాము ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. గ్రంథాలయంలోని ఓ గదిలో సోమవారం రాత్రి కొందరు విద్యార్థులు చదువుకుంటున్న సమయంలో పాము కనిపించడంతో భయంతో కేకలు వేసి పరుగులు పెట్టారు. అక్కడున్న సిబ్బంది పామును బయటికి పంపించారు. పాములు వస్తున్నాయని అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండేళ్లుగా లీకేజీతో సమస్య

దోమకొండ మండలకేంద్రంలోని పలుగడ్డ చౌరస్తా వద్ద పైపులైన్ రెండేళ్లుగా లీకేజీ అవుతోంది. పక్కనే మురుగు కాల్వ ఉండటంతో లీకేజీ అయ్యే చోట కలుషిత నీరు కలిసి ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలగనుంది. ఈ పైపులైన్ నుంచి 50 ఇళ్లకు నీరు సరఫరా అవుతోంది. త్వరగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే దోమకొండ



మూల మలుపులు.. ప్రమాద పిలుపులు

రాజంపేట నుంచి శివాయిపల్లి మీదుగా తలమడ్ల వరకు, అరగొండ మీదుగా అన్నారం తండా, కొండాపూర్ వరకు గల రహదారుల వెంట చెట్లు ఏపుగా పెరిగాయి. ఆయా గ్రామాల గుండా వెళ్లే రహదారులు మలుపులతో ప్రమాదకరంగా ఉన్నాయి. రహదారులు, భవన శాఖ అధికారులు ఎక్కడా మలుపులను సూచించే బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అరగొండ నుంచి కొండాపూర్ వరకు గల రహదారికి చాలా వరకు మలుపులు ఉండటంతో ఇబ్బందులు పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే,రాజంపేట



రాజంపేట నుంచి శివాయిపల్లికి వెళ్లే దారిలో..



శివాయిపల్లి శివారులో రోడ్డుకిరువైపులా చెట్లు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



సమస్య: జిల్లాకేంద్రంలోని 18వ వార్డులో మురుగు కాల్వ పేరుకుపోయింది. **- రాజు, 18వ వార్డు**

స్పందన: క్షేత్రస్థాయిలో యంత్రంతో చర్యలు చేపట్టాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



సమస్య: మూడో వార్డులోని ఇస్లాంపూర్ కాలనీలో వీధి దీపం వెలగడం లేదు. **-రమేష్, స్థానికుడు**

పరిష్కారం: విషయాన్ని ఈఈఎస్ఎల్ పట్టణ పర్యవేక్షకుడు సాయికిరణ్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో సమస్య పరిష్కరింపజేశారు.

సమస్య: పోసానిపేట్ గ్రామ శివారులో మిషన్ భగీరథ గ్రిడ్ పైపులైన్ లీకేజీ అవుతుంది. **-ప్రసాద్, గ్రామస్థుడు.**

సమాధానం: పరిశీలించి నీటి వృథా అరికడతాం. **-రజిత, గ్రిడ్ ఏఈ**

సమస్య: కుర్తి గేటు నుంచి కుర్తి గ్రామానికి వెళ్లే దారిలో మోకాల్లోతు గుంతలు ఏర్పడి కంకర తేలింది. **-నవీన్, స్థానికుడు**

సమాధానం: మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదించాం. **మొగులయ్య, పీఆర్ ఏఈ, పిట్లం**

– న్యూస్‌టుడే, రామారెడ్డి, పిట్లం కామారెడ్డి పట్టణం, బాన్సువాడ పట్టణం

రైతు వేదికల్లో సమస్యలు

పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, న్యూస్‌టుడే: సాగుపై మెలకువలు నేర్పడం, సందేహాల నివృత్తి, అధికారుల సలహాలు, సూచనలు.. రైతు సమావేశాలు తదితర కార్యక్రమాలు నిర్వహించే రైతు వేదికలు అధ్వానంగా ఉంటున్నాయి. చాలా చోట్ల తాళాలు వేసి ఉండటం, తలుపులు ధ్వంసం కావడం నాసిరకమైన పనులతో బోసిపోతున్నాయి. అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు వాపోతున్నారు.



పెద్దకొడప్‌గల్ రైతు వేదికలో కుంగిపోయిన లోపలి భాగం

రూ.లక్షలు వెచ్చించి..

ఒక్కో రైతు వేదికను రూ.22 లక్షలు వెచ్చించి నిర్మించారు. జుక్కల్ నియోజకవర్గంలో నిర్మించిన రైతు వేదికలకు మొత్తం రూ.6.92కోట్లు ఖర్చు చేశారు. కానీ, చాలా చోట్ల నీటి నిర్వహణ అధ్వానంగా ఉంది. నిజాంసాగర్ మండలం వడ్డేపల్లిలోని రైతు వేదికలో తలుపులను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని కాస్లాబాద్ రైతు వేదికలో మరుగుదొడ్లు, తలుపులు తుప్పు పట్టాయి. తాగు నీటి సౌకర్యం లేదు. చాలా చోట్ల ఇలాంటి సమస్య ఉంది.



వడ్డేపల్లిలో ధ్వంసమైన తలుపులు

☛ నిజాంసాగర్ మండల వ్యవసాయాధికారి అమర్ ప్రసాద్ మాట్లాడుతూ.. వడ్డేపల్లి రైతు వేదిక తలుపులు కిటికీలు ధ్వంసం అయ్యాయి. మిగితా ఎక్కడెక్కడ సమస్య ఉందో పరిశీలించి చర్యలు చేపడతాం.

ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటరు నమోదు కోసం ఇంటింటి సర్వే శతశాతం పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. ఎన్నికల ముఖ్య అధికారి సుదర్శన్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన వీసీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో లేవనెత్తిన రేషనలైజేషన్‌ను పరిశీలించాలని కోరారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల కోసం అర్హులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కార్యకర్తలే బలం

జుక్కల్, పిట్లం న్యూస్‌టుడే: పార్టీ పని నిమిత్తం మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌కు జుక్కల్ చౌరస్తాలో స్థానిక కార్యకర్తలు మంగళవారం సన్మానించారు. కార్యకర్తలే తనకు బలమని, వాళ్లకు అండగా ఉంటానని తెలిపారు. నాయకులు ఉమాకాంత్ దేశాయ్, హన్మాండ్లు, మాధవ్, జంగం రాజు ఉన్నారు. పిట్లం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విఠల్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎంపీ పరామర్శించారు. నాయకులు సూరత్‌వంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



జుక్కల్: కార్యకర్తలతో ఎంపీ సురేష్ షెట్కార్

ఉత్తమ బోధన అందించాలి

బాన్సువాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని కొనబాన్సువాడ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ఎలా పెడుతున్నారు? అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలు, బోధన తదితర వివరాలపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని సూచించారు. నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్, ఎజాస్, శ్రీధర్, భవాని ప్రసాద్, కిరణ్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, న్యూస్‌టుడే: గుండెపోటుతో ఇటీవల మరణించిన కార్యకర్త రామాచారి మృతి తీరనిలోటని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యకర్త ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్, నాయకులు కృష్ణారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సబ్‌కలెక్టర్ కిరణ్మయిలను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మంగళవారం కలిశారు. తన నియోజకవర్గంలో కొత్త రేషన్‌కార్డుల జారీ, రోడ్లు, అభివృద్ధి పనులు, పోడుభూముల సమస్యలు, సీజనల్ వ్యాధుల నివారణపై చర్చించారు.



కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయితో చర్చిస్తున్న ఎమ్మెల్యే

చేపల పెంపకంలో మెలకువలు పాటిస్తే లాభాలు

పెద్దకొడప్‌గల్, నాగిరెడ్డిపేట్ న్యూస్‌టుడే: చేపల పెంపకంలో మెలకువలు పాటిస్తే లాభాలు పొందొచ్చని డీపీఎం రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం చేపల పెంపకం లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట్‌లో మండలంలో అక్టోబర్ 1న మండల సమాఖ్య కార్యాలయంలో చేపల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం జగదీశ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని డెయిరీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డా.శరత్‌చంద్ర మాట్లాడుతూ.. సామాజిక సేవాకార్యక్రమాలపై విద్యార్థులు మక్కువ చూపాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఉమాపతి, సిబ్బంది స్వర్ణలత, రవీందర్‌రెడ్డి ఉన్నారు.



డెయిరీ కళాశాలలో ప్రదర్శన చేపడుతూ..

మాచారెడ్డి, న్యూస్‌టుడే: మాచారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. మోటివేషనల్ స్పీకర్ రమేశ్ చైతన్య తిరుపతి గౌడ్, రామకృష్ణ రెడ్డి, ఉన్నారు.

బిచ్కుంద, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో రాణించాలని బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి మాట్లాడారు. ప్రోగ్రామ్ అధికారులు జి.వేంకటేశం, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

భిక్కనూరు, న్యూస్‌టుడే: సమాజంలో ఉన్న సమస్యలను అవగాహన చేసుకుని వాటికి పరిష్కార మార్గాలను చూపుతూ సమాజాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపల్ డా.సుధాకర్‌గౌడ్ తెలిపారు. ప్రాంగణంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి బందెల అంజయ్య, అధ్యాపకులు డా.హరిత, డా.మోహన్ బాబు, డా.సబిత, డా.లలిత, డా.యాలాద్రి, డా.నారాయణ పాల్గొన్నారు.



దక్షిణ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్

ఆకస్మిక తనిఖీ

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను ఆర్డీవో మన్నె ప్రభాకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ వసతి గృహంలో మురుగు నీరు పేరుకుపోవడంతో జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు ఉన్నారు.



ఎలారెడ్డి: మురుగునీటి కాలువను శుభ్రం చేయిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామని టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల ప్రభుత్వ విద్యాలయాల్లో టీపీఆర్టీయూ సభ్యత్వాలను మంగళవారం అందజేశారు. ప్రధానకార్యదర్శి లక్ష్మీరాజం, ప్రతినిధులు తదితరులున్నారు.



సభ్యత్వం అందజేస్తున్న టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు

బాధ్యతల స్వీకరణ

బాన్సువాడ, న్యూస్‌టుడే: బాన్సువాడ ఎస్‌హెచ్‌వోగా అశోక్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. సీఐగా పనిచేసిన మున్నూరు కృష్ణ హైదరాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో అశోక్ నిర్మల్ నుంచి బాన్సువాడ సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, నేరాలను నియంత్రిస్తామని చెప్పారు. స్టేషన్ సిబ్బంది సీఐకి స్వాగతం పలికారు.



వసుంధర పాదయాత్ర నేడు

జుక్కల్, న్యూస్‌టుడే: జగద్గురు రామానందచార్య, దక్షిణ భారత్ పీఠాధిపతి స్వామి శ్రీనరేంద్ర చార్యజీ మహరాజ్ భక్తులు తెలంగాణ ఉప పీఠం నుంచి వసుంధర పాదయాత్రను బుధవారం ప్రారంభించనున్నట్లు భక్తులు తెలిపారు. ఈ పాదయాత్ర తెలంగాణ ఉప పీఠం నుంచి మహారాష్ట్రలోని నానీజ్‌ధామ్ వరకు సుమారు 650 కి.మీ కొనసాగనుంది. చెట్లను నాటడం, పర్యావరణాన్ని గౌరవించడం, కాలుష్యాన్ని నివారించడం స్వామిజీ సందేశమని తెలుపుతూ.. ఫ్లెక్సీలతో పాదయాత్ర చేపట్టనున్నారు. పర్యావరణ పరిరక్షణకు కాలినడకన వెళ్తూ జన జాగృతం చేయడమే లక్ష్యంగా పాదయాత్ర తలపెట్టినట్లు భక్తులు పేర్కొన్నారు.

రిజర్వేషన్లలో తీవ్ర అన్యాయం



నినాదాలు చేస్తున్న నాయకులు

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: రిజర్వేషన్లలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 42 శాతం పెంచుతామని ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే బీసీల మహా ర్యాలీకి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తు, డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు నిఖిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

బాన్సువాడ, న్యూస్‌టుడే: నీటి నాణ్యత, పరిరక్షణపై బాన్సువాడలో తాగునీటి సహాయకులకు మంగళవారం అధికారులు శిక్షణ ఇచ్చారు. నీటి పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డీఈఈ వెంకటేశ్వర్‌గౌడ్, ఏఈ శ్రీకాంత్, టీవోటీ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

26న అంతర్ పాఠశాల క్రీడా పోటీలు

గాంధారి, న్యూస్‌టుడే: ఈ నెల 26న గాంధారి మండల అంతర్ పాఠశాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడల కన్వీనర్ ప్రధానోపాధ్యాయుడు కుమారా స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో బాలబాలికలకు వేర్వేరుగా క్రీడలు నిర్వహిస్తున్నట్లు క్రీడల నిర్వహణ కార్యదర్శి లక్ష్మణ్ రాథోడ్ పేర్కొన్నారు. ప్రారంభానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మదన్‌మోహన్ రానున్నట్లు చెప్పారు.

అదనపు గదుల స్థల పరిశీలన

బీబీపేట, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా పులే పాఠశాలలో ఇరుకు గదుల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో అదనపు గదుల కోసం జడ్పీ సీఈవో చందర్‌నాయక్, ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి ఆరా తీశారు. గ్రామపెద్దలతో కలిసి పలు స్థలాలను పరిశీలించారు. ప్రస్తుత పాఠశాల భవన యజమానితో మాట్లాడారు. మరో 16 అదనపు గదులు అవసరమున్నాయని వాటిని త్వరలోనే నిర్మించి ఇవ్వాలని కోరారు. దీంతో ఆయన రెండు రోజుల్లో అగ్రిమెంట్ తీసుకొని నిర్మాణ పనులు ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ ఉన్నారు.



అదనపు గదుల కోసం అధికారులతో, నాయకులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో చందర్‌నాయక్

ముగిసిన వివాదం



ఒప్పంద పత్రాన్ని గ్రామ పెద్దలకు అందిస్తున్న వ్యాపారి

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరులో వివాదంలో ఉన్న 10 గుంటల వీడీసీ స్థలాన్ని తిరిగి వీడీసీకి అప్పగించేందుకు ఒప్పందం కుదిరింది. ఇట్టి స్థలాన్ని ఓ వ్యాపారి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని గ్రామంలో కొన్ని రోజులుగా గ్రామస్థులు ఆరోపించారు. మంగళవారం భిక్కనూరులోని అన్ని కుల సంఘాల ప్రతినిధులు, పెద్ద మనుషుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. వీడీసీకి చెందిన 10 గుంటల స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారిని అక్కడికి రప్పించి చర్చించారు. ఈ నెల 28వ తేదీ వరకు వీడీసీ పేరుపై రిజిస్ట్రేషన్ చేసి, హద్దు రాళ్లు పాతి ఇస్తానని అందరి సమక్షంలో ఒప్పుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

క్రీడాకారులకు నగదు అందజేత

రెడ్డిపేట్(రామారెడ్డి), న్యూస్‌టుడే: జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు వెళుతున్న క్రీడాకారుల ప్రయాణ ఖర్చులకు గ్రామ అభివృద్ధి కమిటీ తరపున మంగళవారం నగదు అందజేశారు. జమ్మూకశ్మీర్‌లో ఈ నెల 28న జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్న గ్రామానికి చెందిన బిందు, వైష్ణవిలకు రూ.10 వేల నగదును అందించారు. పోటీల్లో రాణించి పతకాన్ని సాధించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నర్సింలు, ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి సతీష్, కోశాధికారి లింగం, వ్యాయామ ఉపాధ్యాయుడు సాయిమౌర్య పాల్గొన్నారు.



రెడ్డిపేట్‌లో క్రీడాకారులను అభినందిస్తున్న గ్రామస్థులు

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డిలో ఓ ప్రైవేటు పాఠశాలలో చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్‌శిక్షక్ వెల్లడించారు. మంచిని బోధించాల్సిన ఉపాధ్యాయులే ఇలాంటి చర్యలకు పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. చిన్నారిపై అనుచితంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ ఓ ప్రకటనలో తెలిపారు. సమాజంలో ఆడ పిల్లలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

నిజాంసాగర్, మహ్మద్‌నగర్, బిచ్కుంద, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారంతో ఆరోగ్యకర జీవనం అలవడుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. బిచ్కుంద, మహ్మద్‌నగర్ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు రవీందర్‌రెడ్డి, గంగాధర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జయప్రదీప్ తదితరులు ఉన్నారు.



జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

సామూహిక కుంకుమార్చన



బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోట దుర్గా ఆలయంలో మంగళవారం భక్తులు సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, లలితా సహస్ర పారాయణం చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

దీపాదాస్ మున్షీని కలిసిన నాయకులు

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని మైలారం తండా వాసి ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ రాథోడ్ హైదరాబాద్‌లోని గాంధీ భవన్లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అంబర్ సింగ్, రవి చవాన్, తారు నాయక్, సంతోష్ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నిజాం, ఉపాధ్యక్షుడిగా సంతోశ్‌రెడ్డి, కార్యదర్శిగా శివకుమార్, సహ కార్యదర్శిగా సతీశ్, మహిళా కార్యదర్శిగా లత, కోశాధికారిగా సుజాత, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా వేణు ఎన్నికైనట్లు అధికారి అజ్మల్ ఖాన్ ప్రకటించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గాంధారి, న్యూస్‌టుడే: గాంధారి అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని దుర్గానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అగ్ని, నీటి ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది తూర్పు వెంకట్ రాజు, నవీన్, నరేందర్, శివ తదితరులు ఉన్నారు.

ఉత్తర్వు నం.25ని వెంటనే సవరించాలి

కామారెడ్డి పట్టణం : ప్రభుత్వం విడుదల చేసిన

అవీ...ఇవీ.. అన్నీ

ఉత్తర్వు నం.25ని వెంటనే సవరించాలని ప్రాథమిక బడుల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమేశ్, పందిరి రాజేశ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఎస్సీ ద్వారా నియామకాలు పూర్తయిన తర్వాతే సర్దుబాటు చేయాలన్నారు. ప్రాథమిక విద్య బలోపేతం కోసం సర్కారు చర్యలు తీసుకోవాలని కోరారు.

అశాస్త్రీయమైన సర్దుబాటు చర్యలు ఆపాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: అశాస్త్రీయమైన సర్దుబాటు చర్యలను సర్కారు వెంటనే ఆపాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్, రాష్ట్ర కోశాధికారి సంగయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్జీటీల బదిలీల్లో నిబంధనలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రతి ప్రాథమిక బడిలో ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు ఉండాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు.

స్వచ్ఛతా హీ సేవా

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బోర్లంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలోని చెత్త తొలగించి, నీటి ట్యాంకు పరిసరాలు శుభ్రం చేయించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ఇంటి ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాయికుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బ్రహ్మం తదితరులు

ఖోఖో జట్టు ఎంపిక

గర్గుల్(కామారెడ్డి గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని గర్గుల్ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్ 17 బాలుర, బాలికల ఖోఖో జట్టు ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. క్రీడాకారులు బుధవారం నుంచి జరగబోయే శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి హిరలాల్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బ్రహ్మం తదితరులు ఉన్నారు.

భారతీయ కిసాన్ కమిటీ ఎన్నిక

సదాశివనగర్, న్యూస్‌టుడే: సదాశివనగర్ మండల, వజ్జెపల్లి భారతీయ కిసాన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమరి ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడిగా మల్లయ్యను ఎన్నుకున్నారు.

ఆకట్టుకుంటున్న సిలిండర్

మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే వంట గ్యాస్ పంపిణీ చేస్తోంది. ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకం గురించి సర్కారు ప్రజలకు మరింత అవగాహన పెంచేందుకు కామారెడ్డి కలెక్టరేట్‌లో పెద్ద ఎయిర్ సిలిండర్‌ను ఏర్పాటు చేయించింది. ఈ సిలిండర్‌పై ప్రభుత్వ ఆరు గ్యారంటీల లోగోతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రాలు ఉన్నాయి. అటుగా వచ్చిన వారిని ఈ సిలిండర్ ఆకట్టుకుంటోంది. **– న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్**



రోడ్డు ప్రమాదంలో గాయపడి వాచ్‌మెన్ మృతి

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వాచ్‌మెన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట గ్రామానికి చెందిన సిరిగాపురం సాయిలు(47) అమీన్‌పూర్ పురపాలక పరిధి కిష్టారెడ్డిపేటలో ఉంటూ వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. ఈ నెల 17న సాయంత్రం నిత్యావసర సరకులు తేవడానికి బీరంగూడకు నడుచుకుంటూ బయల్దేరాడు. మార్గమధ్యలో నవ్య చౌరస్తా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుమారుడు పాపయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధుడికి అస్వస్థత

☛ *ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి*

ఎల్లారెడ్డిపేట: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లెకు చెందిన వృద్ధుడు వట్టిమల్ల ఎల్లయ్య (67) ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మంగళవారం సాయంత్రం మార్గమధ్యలో మృతి చెందాడు. వివరాలిలా.. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎల్లయ్యను భార్య రాజవ్వ కరీంనగర్‌లోని ఆసుపత్రికి ఆర్టీసీ బస్సులో తీసుకెళ్తుంది. ఎల్లయ్య తీవ్ర అస్వస్థతకు గురికావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి వద్ద దింపేశారు. ఈ మేరకు స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలిస్తుండగా గుండెపోటుతో మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు.

నకిలీ పైపుల విక్రయంపై కేసు నమోదు

బాన్సువాడ, న్యూస్‌టుడే: నకిలీ పైపులు విక్రయించడంపై పట్టణంలోని ధనంజయ ట్రేడర్స్ దుకాణ యజమానిపై బాన్సువాడ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మీ కంపెనీ పేరుతో నకిలీ పైపులు విక్రయిస్తున్నారని సదరు కంపెనీకి మూడు నెలల కిందట ఆన్‌లైన్‌లో ఫిర్యాదు అందింది. దీంతో కంపెనీ ప్రతినిధులు ఆ దుకాణానికి వినియోగదారులుగా వచ్చి పైపును కొనుగోలు చేసి కంపెనీకి పంపారు. పరీక్షల అనంతరం అది నకిలీదని తేలడంతో ఈ నెల 10న మరోసారి వచ్చి మరో పైపు కొనుగోలు చేసి పరీక్షించారు. తమ కంపెనీ పేరుతో నకిలీ పైపులు విక్రయిస్తున్నారని సదరు ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు దుకాణాన్ని పరిశీలించారు. పైపులు జప్తు చేసి యజమానిపై కేసు నమోదు చేశారు.

విద్యార్థినికి గాయాలు

లింగంపేట్, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని కావ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బస్సు లో వెళ్తుండగా దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. విద్యార్థిని తలకు గాయం కావడంతో కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి మండలం ఉగ్గరవాయి గ్రామ శివారులోని మైసమ్మ ఆలయ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.